# ఊరగాయ జాడీ



"ఏమండోయ్ మిమ్మల్నే... వింటున్నారా?"

"ఎవర్నే... నన్నేనా? ఏమిటో చెప్పకుండానే- ఏం విని ఏడవమంటావే?"

"అలాగే చెప్పి ఏడుస్తా కానీ, ముందీ ఊరగాయ జాడీలన్నీ అటకెక్కించాలండీ! కాస్త ఇటు రండీ!"

"నాది మడి బట్ట కాదు కదే! నేనెలా ఊరగాయ జాడీలు అటకెక్కించి ఏడిశేది?"

"నూతి దగ్గరకు వెళ్లి రెండు బకెట్ల నీళ్లు గుమ్మరించుకు రండీ!"

వెంకటరత్నమ్మగారు వంటింట్లోంచే సావిట్లోకి వినబడేంత గట్టిగా చెప్పింది.

"నీ మాట బంగారంగానూ... ఆ మాట ముందే చెప్పి ఏడవచ్చుగదే!" సావిట్లో కర్ర కుర్చీలో కూర్చున్న హనుమంతరావుగారు నూతి వైపు అడుగులేశారు.

"ఏమిటో! ఎన్నాళ్లు ఈయనతో కాపురం చేసినా మాటకు ముందు ఏడవడం ఏమిటో అర్థమై ఏడవడం లేదు!" అంతలో ఆవిడ మాట ఆవిడకే గుర్తుకొచ్చి-

"అయ్యో రాతా! ఆయన ఏడవడం నా వెంటపడినట్టుంది!" నాలిక కరుచుకుని నేలమీద చతికిలబడింది.

"ఈ మడీ, దడీ ఏమిటో! రోజురోజుకీ దీని చాదస్తం మరీ పెరిగిపోతోంది!"

అనుకుంటూ హనుమంతరావుగారు నూతిలోంచి రెండు బకెట్ల నీళ్లు తోడుకుని తల మీద గుమ్మరించుకున్నారు. అంగవస్త్రం గట్టిగా పిండి దానితోనే వళ్ళంతా తుడుచుకున్నారు.

అంతలో పనిపిల్ల బుచ్చి అక్కడకు వచ్చింది.

ఆయనది నున్నటి గుండే అయినా జానెడు పిలక. ఆ పిలక చూసే బుచ్చి ఆయన్ని ఓ ఆట పట్టిస్తూ ఉంటుంది.

"మీ పిలక బాగా తడిసిందో లేదో! రెండు బక్కెట్ల నీరు తోడి పొయ్యమన్నారేటి!" అంటూ బుచ్చి ఆయనకు దగ్గరగా వెళ్లబోయింది.

"పో!పో! దూరం! దూరం!"

... అంటూ ఆయన పిలక మరోసారి ఝాడించి ముడి వేసుకుంటూ వంటింటి వైపు అడుగులేశారు.

"అయ్యా! తడిపంచె ఆరేయాలా! ఈడే ఉంచమంటారా?" ఈసారి బుచ్చి మాటలకు మరింత కోపం వచ్చిన ఆయన వెనక్కి వచ్చి బెదిరించి వంటింట్లోకి వెళ్లిపోయారు.

పన్నెండేళ్ల బుచ్చి నవ్వుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మొన్నటివరకూ పాతకాలంనాటి నల్లటి గుండల్లోనే ఊరగాయలన్నీ పెట్టుకునేవారు. నూనె పీల్చి వేస్తాయని కొత్తగుండల్లో ఊరగాయ పెట్టరు.

వెంకటరత్నమ్మగారి కోడలు ఊరగాయలు పెట్టుకోవడానికి జాడీలు కొని ఇచ్చింది. పైగా.. ఆ జాడీలు పెట్టుకోవడానికి ఓ అలమారు కూడా వంటింట్లో కట్టించింది.

మొదట్లో వెంకటరత్నమ్మగారికి జాడీల్లో ఊరగాయలు పెట్టుకోవడం ఇష్టం లేదు. రానురాను కొత్త అలవాటే పాతై బాగానే అనిపించింది.

ఇప్పుడావిడ కళ్ళకి ఆ జాడీలు అలమారులో సర్దిన బుట్టబొమ్మల్లా అనిపిస్తున్నాయి.

"ఇదేమిటి, ఈ జాడీలన్నీ మళ్లీ ఈ నేలమీద ఇలా పెట్టి ఏడిశావేమిటే!" ఆయన ఆశ్చర్యంగా అడిగాడు.

"మన వెంకటాచలంగారి అమ్మాయి పెళ్ళి కదండీ... మనిల్లే విడిదిట! వచ్చిన చుట్టాలంతా మన మడి ఊరగాయలు తినిపోతారండీ! అందుకే ఈ జాడీలన్నీ ఎవరికంటా పడకుండా అటకెక్కించేద్దామండీ!"

"ఓసి నీ తెలివి కాకులెత్తుకెళ్లా! ఎంతెంత ఆలోచనలే నీవీ! ఇంతకీ... ఆ పెళ్ళి ఎప్పుడేడిసిందిటా?"

"అవ్వ! అవ్వ! ఎవరేనా వింటే నవ్విపోతారండీ! శుభమాని వాళ్ళు పెళ్ళి చేసుకుంటుంటే... ఏడవడాలేమిటండీ? ముందా జాడీలు అటక మీద పెట్టండీ!"

"అదిసరే కానీ! ముందా జాడీలు నాకందించి ఏడు?"

– అంటూనే ఆయన నిచ్చెనెక్కి ఆవిడ అందించిన జాడీలు అందుకుని నిచ్చెన పైకి ఎక్కుతున్నాడు. నిచ్చెన నేల మీద గుంటల్లో ఉన్నా ఆయన బరువుకీ, జాడీ బరువుకి నిచ్చెన కదులుతూనే ఉంది.

"గట్టిగా పట్టుకుని ఏడవ్వే! లేకపోతే నేను నేల మీద పడి చస్తానే!" ఆయన భయంతో అరుస్తూనే ఉన్నాడు.

"గట్టిగానే పట్టుకున్నానండీ, మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డండీ!" ఆవిడ సమాధానం చెబుతూనే ఉంది.

మొత్తం మీద ఆవకాయ, మాగాయ, మెంతికాయ, తొక్కుడు పచ్చడి, చింతకాయ పచ్చడి, ఉసిరికాయ పచ్చడి... మొత్తం ఆరు జాడీలు అటక మీద పెట్టాడాయన.

ఆయాసంతో కిందికి దిగేటపుడు నడుం కలుక్కుమని ఆయన కెవ్వుమన్నాడు.

ఆ అరుపునకు ఆవిడ గుండె జారింది. మెల్లిగా ఆయన చెయ్యి పట్టి నడిపించి హాల్లో పట్టెమంచం మీద కూర్చోపెట్టింది.

"అయ్యో! నడుం విరిగి ఏడిసినట్టుందే!" అయన బాధతో మూలిగాడు.

"నడ్డే కదండీ! కాస్త ఓర్పు పట్టండీ! జాడీ విరగలేదు కదండీ! కాస్త సున్నం, బెల్లం పట్టు వేస్తే అదే సర్దుకుంటుంది లెండి!"

ఆవిడ వంటింట్లోకి వెళ్లి ఓ గిన్నెలో సున్నం, బెల్లం వేసి బాగా నూరింది. కాస్త నూనె వేసి మరోసారి చూపుడువేలితో పాకంలా కలిపింది.

దాన్ని తెచ్చి ఆయన వీపు మీద పట్టు వేసింది.

"అహా..! కాస్త గట్టిగా రాసి ఏడవ్వే..!" ఆయన బాధగా అడిగాడు.

"అలాగే రాసి ఏడుస్తాలెండి!" ఆవిడ ఆయన వీపుమీద ఎడం చేత్తో గట్టిగా నొక్కి కుడిచేత్తో మరింత గట్టిగా రాసింది.

"అమ్మా! కూసంత ఊరగాయ పెడతారనుకున్నా! అంతా అటకెక్కించేశారేంటి?" అప్పుడే అక్కడకు వచ్చిన బుచ్చి అడిగింది.

"ఇదిగో బుచ్చీ! నువ్వెక్కడికి పోతావ్! ఊరగాయ ఎక్కడికి పోతుందే! ఈ మాటు అటక నుంచి దింపినప్పుడు పెడతాలే!" అంది వెంకటరత్నమ్మగారు.

"అయ్యా నడ్డి నే పడతానమ్మా! మీరెల్లి పని చూసుకోండి!" అంది నవ్వుతూ బుచ్చి.

"ఓసి... నీ మొగుడు నిన్నెత్తుకెళ్లా! పోతావా, లేదా?" ఆయన మంచం మీంచి లేవబోయాడు.

మళ్లీ నడ్డి కలుక్కుమనడంతో తిరిగి మంచం మీద వాలాడు.

బుచ్చి పకపకా నవ్వుతూ అక్కడి నుంచి పరుగెత్తింది.

రెండవ నాటికి ఆయన మామూలుగా లేచి తిరగగలిగాడు.

తరచు స్నానాలు, తడి బట్టలు, నీళ్లలో తిరగడంతో వెంకటరత్నమ్మగారి పాదాలు, వేళ్లు పుళ్లు పడి ఉన్నాయి.

ఆరోజు ఆవిడ పాదాలు మరింత బిగపట్టి నడవలేక నడుస్తోంది.

"అదేమిటే? అలా అడుగులు ఎత్తెత్తి వేస్తున్నావేమిటే!" ఆయన మాటల్లో ఆతృత తొంగిచూసింది.

"ఏముందీ? కాళ్లూ, వేళ్లూ మంటలు. రోజూ ఉంటే రోగమే కదండీ!" ఆవిడ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఆయన చూడకుండా పమిటకొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"నీ స్నానాలు, మడులు, చాదస్తాలు మండిపోనూ! ఈ తడి బట్టల గోల వదలవే. అబ్బాయి నీకెన్నిసార్లు చెప్పాడే... ఇవన్నీ కాస్త వదలమనీ! ఈ జన్మకి నువ్వు మారవే! ఏదీ ఇటురా... చూస్తానూ?" అన్నాడు ఆయన– విసుగు, జాలి మిళితమైన స్వరంతో.

ఆవిడ కుంటుతూ దగ్గరకు రాగానే ఆవిడ చెయ్యి పట్టి మంచం మీద పక్కనే కూర్చోపెట్టుకున్నాడు. ఆమె పాదాలు పట్టి చూశాడు.

రెండు పాదాలు పుళ్ళుపడి రక్తం చిమ్ముతున్నాయి.

వేళ్లయితే ముట్టుకుంటే చేతుల్లోకి ఊడొచ్చేట్టున్నాయి. పైగా– వేళ్లకున్న వెండి మట్టెలు ఆ పుళ్లలో ఇరుక్కుపోయి ఉన్నాయి. ఆమె వద్దని మొత్తుకుంటున్నా ఆయన వినిపించుకోకుండా ఆ మట్టెలు తీసి పక్కన పెట్టాడు.

కారే రక్తాన్ని దూదితో తుడిచి గుడ్డ కట్టాడు.

'వెర్రిబాగుల్ది! ఎలా వెడతాయో రోజులు!' అనుకున్నాడు మనసులో. ఆయన గుండెలో ఎక్కడో కలుక్కుమంది. చెమర్చిన కళ్లను భుజం మీదితుండుతో తుడుచుకున్నాడు.

"ఓసి మొండిదానా? ఇంతనొప్పి ఎలా భరిస్తున్నావే?" అంటూనే ఆయన వంటింట్లోకి వెళ్లి సున్నం నీళ్ళు, కొబ్బరినూనె కలిపి, బాగా రంగరించి నవనీతం తయారుచేసి పట్టుకొచ్చాడు.

"నా కాళ్లకి మీరు రాయడమేమిటండీ! నేనే రాసుకుంటానండీ!" ఆమె ఎంత చెప్పినా వినకుండా ఆమె పాదాలకి, వేళ్లకి బాగా పట్టించాడు.

ఆమె బాధకి కాస్త ఉపశమనం కలిగినట్లయింది.

ఆమెను బలవంతంగా పడుకోబెట్టాడు.

వత్తుల స్టౌ అంటించి కాఫీ పెట్టి ఆమెకు ఇచ్చాడు. ఆయన ఇంటికెదురుగా ఉన్న పినతల్లిగారింట్లో భోజనం చేసి వచ్చాడు.

"అన్నట్లూ... కోడలు నీ కాళ్ల పగుళ్ళకి ఆయింట్‌మెంట్ కొనిపించింది కదే!" ఆయనకు చటుక్కున గుర్తుకువచ్చింది.

అలమారు తీసి ఆయింట్‌మెంట్ ఆవిడ పాదాలకి, వేళ్లకి బాగా రాశాడు. కాళ్ల మంటలు కాస్త తగ్గడంతో ఆవిడకు నిద్రపట్టింది.

మరునాడు తెల్లారకుండా ఆవిడ లేచి కూర్చుంది.

"ఈ పూట నీకు మడి, దడి కద్దు. అత్తెసిరి నే పడేస్తానుండు!"

ఆయన ఎంత చెప్పినా ఈవిడ వినలేదు. రెండు చెంబుల వేన్నీళ్లు గుమ్మరించుకుని ఆరేసిన పట్టుచీరతో వంట చేసింది. భోజనాలయ్యాక ఆవిడ వచ్చి సావిట్లో బల్లమీద కూర్చుంది. దానికి మడి బల్లనే పేరు.

ఆయన కోడలు కొనిచ్చిన హవాయి చెప్పులు పట్టుకొచ్చి ఆవిడ కాళ్ల ముందు పెట్టాడు.

"ఇదేమిటండీ!" ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది.

"కాళ్ళు పుళ్లు పడకుండా నీ కోడలు చెప్పులేసుకు తిరగమందిగా! ఇవి మడికి కూడా పనికి వస్తాయిట. వేసుకో..!" ఆయన బలవంతం చేశాడు.

"అమ్మో! ఈ చెప్పులేసుకుని నేను నడవలేనండీ!" అంది భయంగా.

ఆయనే ఆవిడ కాళ్లకి చెప్పులెక్కించబోయాడు.

ఇక తప్పదనుకున్న ఆవిడ బల్ల దిగింది.

కాళ్లకి చెప్పులు తొడుక్కోవడానికి ప్రయత్నించింది. ఆవిడకు సరిగా చేత కాకపోతే ఆయన సహాయం చేశాడు.

మొత్తం మీద చెప్పులు కాళ్లకి వేసుకోగలిగింది.

"నడు... నడు..." అంటూ ఆయన తొందరపెడితే ఆవిడ చిన్నపిల్లలా తప్పటడుగులు వేసింది.

ఆయన చప్పట్లు కొట్టాడు.

"అబ్బో... పట్నం మనిషిలా ఉన్నావే!"

ఆయన ముసిముసి నవ్వులకు ఆవిడ పూచిన తంగేడయింది. ఆవిడ చెవి కమ్మల కాంతులు ఆవిడ చెక్కిళ్ళ మీద గంతులేశాయి.

పట్నంలో చదువుకుంటున్న ఘనశ్యామ్ రెండురోజుల సెలవుకి ఇంటికొచ్చాడు.

ఆరోజు హనుమంతరావుగారు పొరుగూరు వెళ్లారు. రాత్రికి కాని ఇంటికి రారు. ఘనశ్యామ్ ఉల్లిపాయ పకోడీలు చేయమని తల్లిని బతిమాలాడు.

కొడుకు కొని తెచ్చిన ఉల్లిపాయలతో పకోడీలు చేసింది. తల్లిని కూడా తినమని కొడుకు ఎంత బతిమాలినా ఆవిడ వినలేదు.

"నీ తండ్రికి లేని రుచులు నాకెందుకురా?" అంది.

మిగిలిన పకోడీలు తండ్రి కంటబడకుండా అతను గదిలో దాచుకున్నాడు.

ఆవిడ ఉల్లి తరిగిన కత్తిపీటని పీచుతో మట్టిపెట్టి తోమింది. ఆ నూనె పెంటలో పారబోసింది. ఉల్లి తుక్కు పెంటలో కాక మండే పొయ్యిలో పోసింది. పకోడీలు వేసిన చోట శుభ్రంగా కడిగేసింది. ఇంట్లో ఎక్కడా పకోడీలు వండిన జాడ లేకుండా చేసింది.

అంతలో... హనుమంతరావుగారు కాలరుద్రుడిలా మండిపడుతూ లోపలికి వచ్చారు.

"ఏరా! నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదురా? ఆ మల్లయ్య కొట్లో ఉల్లిపాయలు కొని తెస్తావురా? ఏది మీ అమ్మ? ఎక్కడ ఏడిసిందిరా?" కొడుకు సమాధానం కోసం ఎదురుచూడకుండానే చెప్పులు విప్పి వంటింటి వైపు వెళ్లాడు.

ఉల్లిపాయ పకోడిల వాసనకు ఆయన ముక్కుపుటాలు ఎగిరాయి. ఆయన కోపం తారాస్థాయికి చేరింది.

"నీకు బుద్ధిలేదా? గడ్డి తింటున్నావా?" అంటూ నానా తిట్లు తిట్టాడు. కోపం పట్టలేక ఆయన కొట్టడానికి చెయ్యెత్తాడు. అతనిలో ఏదో వివేకపు పొర లాంటిది కదిలి కొట్టలేక చెయ్యి దించుకున్నాడు.

"బుద్ధిలేని దానా? వాడికి తినాలని ఉంటే రెండు రూపాయలు పడేసి బజారులో కొనుక్కుని తినమన లేకపోయావా? ఛీ! ఛీ!"అంటూ భుజం మీది కండువా దులుపుకుంటూ అక్కడ నుంచి గదిలోకి వెళ్లిపోయాడు.

ఆవిడ అలాగే కాసేపు నిలబడిపోయింది.

సమాధానమిస్తే తాటాకు మంటలా ఆయన కోపం భగ్గుమంటుందని ఆమెకు బాగా తెలుసు.

కొడుకు మాత్రం తండ్రి కంట పడకుండా తప్పించుకున్నాడు.

రెండురోజుల వరకూ ఆయన కోపం చల్లారలేదు.

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా సాధిస్తూనే ఉన్నాడు. మూడవరోజు కొడుకు వెళుతుంటే అనేక జాగ్రత్తలు చెప్పాడు.

కారే కన్నీళ్లు దాచుకుంటూ ఘనశ్యామ్ తండ్రి పాదాలకు నమస్కరించి బయలు దేరాడు. కొడుకు వెడుతుంటే ఆ తల్లి గుండె చెరువయింది.

ఆరోజు వెంకటాచలంగారింట్లో పెళ్లి.

చుట్టాలంతా ఎక్కడెక్కడివారు తరలి వచ్చారు.

విడిది కూడా వీరిల్లే మూలంగా సన్నాయి, బాండు మేళాలతో ఆ ఇల్లు కళకళ్లాడింది.

భార్యాభర్తలిద్దరూ పెళ్లివారితో కలిసి మరింత హడావుడిగా తిరిగారు.

వెంకటాచలంగారి కుటుంబానికి వీరికి దగ్గర బంధుత్వాలున్నాయి. అందుకే వచ్చిన చుట్టాలందరూ ఇద్దరికి కావలసిన వారే!

"అదేమిటే మరదలా! మీ ఇంట్లో మడి ఊరగాయలు లేవా ఏమిటి?" వరసకు పిన్నత్తగారి కూతురు ఉండబట్టలేక అడిగింది.

"అయ్యో వదినా! ఏం చెప్పనే? కుంచెడు కారంతో ఆవకాయ పెట్టానా? నాలుగు నెలలు తిరక్కుండానే ఓ బద్ద కూడా లేకుండా ఉష్ కాకి అయిపోయిందనుకో!" వెంకటరత్నమ్మగారు మరింత తెలివిగా సమాధానమిచ్చింది.

"అవునా మరదలా? నీ చేతి ఆవకాయ రుచి చూసే అదృష్టం మాకు లేదన్నమాట!" అందావిడ మరేమీ అనలేక. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ఆవిడ మెల్లిగా అక్కడ నుండి జారుకుంది. రెండవరోజు రాత్రికే వచ్చిన పెళ్లి వారందరూ తిరుగు ప్రయాణమయ్యారు.

ఉరుముల వాన వెలిసిన ప్రకృతిలా ఆ ఇల్లు నిశ్శబ్దమైంది.

"చూశారాండీ! మనం ఊరగాయలు అటకెక్కించకపోతే ఈపాటికి జాడీలన్నీ ఖాళీ అయ్యేవండీ!" అంది వెంకటరత్నమ్మగారు ఊపిరి పీల్చుకుంటూ.

"నీ తెలివి బంగారంగానూ. నీ ప్లాను గట్టిగా ఏడిసిందిలే!" అన్నాడు నవ్వుతూ.

ఆ రాత్రికే వాన ప్రారంభమైంది. వెంకటరత్నమ్మగారి గుండెలు గుభిల్లుమన్నాయి.

"ఏమండోయ్! వినండీ! అటక మీద వానపడుతుందండీ. ఊరగాయ జాడీలన్నీ తడిసిపోతాయండీ!" నిద్రపోతున్న భర్తని కంగారుగా లేపింది.

"మడికట్టుకోవాలిగా! తెల్లారేకా చూసి ఏడుద్దాంలే!" ఆయన కళ్ళు పూర్తిగా విప్పకుండానే సమాధానమిచ్చాడు.

ఆ రాత్రంతా వానపడుతూనే ఉంది.

వెంకటరత్నమ్మగారి కంటికి సరిగా నిద్రలేదు.

వెలుగు రాగానే తిరిగి భర్తను పిలిచింది. ఎంత లేపినా ఆయన లేవలేదు. ఆయన వంటి మీద చెయ్యివేసి చూసి ఆవిడ కెవ్వుమంది.

ఆయన వళ్ళు కాలిపోతోంది.

సాధారణంగా ఆయనకు ఆచారిగారే వైద్యం చేస్తారు. ఈసారి ఇంగ్లీషు డాక్టర్‌కి కబురు పెట్టింది. ఆయన వచ్చి ఆవిడ కంగారు చూసి సూది ఇచ్చి మందులు రాసి వెళ్లాడు.

హనుమంతరావుగారి జ్వరం తగ్గాలని ఎందరో దేవుళ్లకి మొక్కింది. డాక్టర్ రాసిచ్చిన మందులు తెప్పించి ఎంతో శ్రద్ధగా వాడింది.

మూడవ రోజుకి జ్వరం తగ్గి ఆయన లేవగలిగాడు.

ఆ రెండు రోజులు ఆవిడ నోటికి ముద్దపోలేదు. కంటికి కునుకు రాలేదు. ఆవిడ చిక్కి సగమయింది.

"అయ్యో! ఈ రెండురోజుల్లో ఇలా చిక్కిపోయావేమిటే! రేప్పొద్దున్న నేను ఏమైనా అయితే ఎలా బతికి ఏడుస్తావే! వెర్రిదానా?" ఆయన కళ్ళు చెమర్చాయి. కంఠం జీర వచ్చి మరి మాట పైకిరాలేదు. వెంకటరత్నమ్మగారు జలజల వస్తోన్న కన్నీళ్లని పమిటకొంగుతో తుడుచుకుంది.

ఆరోజు ఆయన స్నానం చేసి, తడి పంచె కట్టి నిచ్చెనెక్కి ఒక్కొక్క జాడీ దింపుతున్నాడు. ఆవిడ తలకు స్నానం చేసి, తడిచీరతో కింద నిలబడి జాడీ అందుకుని వారగా పెడుతోంది.

నిచ్చెన కదిలినప్పుడల్లా ఆయన "గట్టిగా పట్టుకుని ఏడవ్వే! లేకపోతే నేను కిందపడి ఏడుస్తానే!" ఆయన అరుస్తూనే ఉన్నారు.

"మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డండీ! గట్టిగానే పట్టుకున్నా!" అంటూనే ఉంది.

ఆయన అనుకున్నంతా జరిగింది...

పక్కకు నిచ్చెన జారడం, ఆయన జాడీతో సహా నేలమీద పడడం జరిగిపోయింది. జాడీ ముక్కలై ఎర్రగా ఊరగాయ నేలంతా పరుచుకుంది. ఆయన నేలమీద కుప్పలా పడి మరి లేవలేకపోయాడు.

అంత కంగారులోనూ ఆవిడ జాడీల మూతలు తీసి చూసుకుంది.

ఊరగాయంతా బూజు పట్టేసింది. ఆవిడ గుండె జారింది.

కళ్ళు తిరిగి నేల మీద పడబోయి తమాయించుకుంది. అప్పుడు అచేతనంగా పడి ఉన్న భర్తను సమీపించి ఘొల్లుమంది.

అది విన్న వీధిలో జనం పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆయన ముఖం మీద నీళ్లు జల్లి తుడిచారు.

ఆయనలో కాస్త చలనం వచ్చింది.

మెల్లిగా లేవతీసి ఆయన్ని మంచం మీద పడుకోబెట్టారు. ఎవరో పరుగెత్తికెళ్లి డాక్టర్ని తీసుకొచ్చారు.

"ఏం ఫరవాలేదండీ! ఏం పెద్ద దెబ్బలు తగల్లేదు. కాలు బెణికింది అంతే!" అంటూ డాక్టర్ ఆయన కాలికి కట్టుకట్టాడు. చెక్కుకు పోయి రక్తం వస్తున్న చోట మందులు రాసి ఇంజక్షన్ ఇచ్చి వెళ్లిపోయాడు.

ఆయన కళ్ళు తెరిచాడు.

వచ్చిన వాళ్ళంతా వెళ్లారు. ఆవిడ కాఫీ కలిపి ఆయన చేత మెల్లగా తాగించింది. ఆవిడ దు:ఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది. తను పడినందుకు కాదు. ఊరగాయలు పాడైనందుకు ఏడుస్తోందని ఆయనకు తెలుసు.

జాడీలు దింపేటప్పుడే ఆయన ఊరగాయలన్నీ బూజు పట్టాయని చూశాడు. ఆవిడను బాధ పెట్టడం ఇష్టం లేక చెప్పలేదు.

ఆ దంపతులకి ఇద్దరే సంతానం.

పెద్దకొడుకు రఘురామ్ అమెరికా నాలుగేళ్ల క్రితం వెళ్లాడు. అతనికి ఊరగాయలంటే ఇష్టం. వెళ్లేటప్పుడు కావలసిన ఊరగాయలన్నీ పట్టుకెళ్లాడు.

ప్రతి సంవత్సరం కొడుకు వచ్చి ఊరగాయలు పట్టుకెళతాడని ఆవిడ ఆశ. అతను మళ్లీ రానేలేదు.

"ఏమండీ! ఊరగాయలన్నీ బూజు పట్టాయండీ! అబ్బాయి డిసెంబర్‌లో వస్తే ఊరగాయలు ఎలాగండీ!" ఆవిడ భర్తను పట్టుకుని బావురుమంది.

"వాడికి కొన్న ఊరగాయలు కూడా ఇష్టమే. వాడికి కావలసిన ఊరగాయలన్నీ కొనిద్దాం!" అన్నాడు ఓదార్పుగా.

"జాడీ పగిలిపోయిందండీ!" అంది బేలగా.

"కొత్త జాడీ అంతకంటే పెద్దసైజు కొనుక్కుందాం!" అన్నాడు.

కొడుకు డిసెంబర్‌లో రావడం లేదని మాత్రం ఆయన చెప్పలేకపోయాడు. కొడుకు రావడం లేదని రాసిన ఉత్తరం ఆవిడ కంటపడకుండా దాచుకుని అప్పుడప్పుడు చదువుకుంటున్నాడు. కన్నీళ్లు తుడుచుకుంటున్నాడు. ఆవిడ మనసుకు కాస్త ఊరట కలిగింది.

వెంకటరత్నమ్మగారు కన్నీళ్లు పమిట కొంగుతో ఒత్తుకుంది. కారే ముక్కుని తుడుచుకుంది. చిలకముక్కులా ఎర్రబడిన ఆమె ముక్కు మీద బేసరి, నిమ్మగుత్తి చెరో వైపు తళుక్కుమన్నాయి.

బుచ్చి మాత్రం బూజు పట్టిన ఊరగాయల వైపు బిత్తరపోయి చూసింది.

కథా నిలయం
శ్రీకాకుళం

- *'ఆంధ్రభూమి'* వార పత్రిక... *13 జూన్, 2002*